# ఇండియన్ పాలిటీ

## పార్లమెంటు కార్యకలాపాలు

ప్రజాస్వామ్య ప్రభుత్వం విజయవంతంగా పనిచేయడానికి నియంతృత్వాన్ని నివారించే చర్యలుండాలి. ప్రభుత్వ విధానాలు, పనితీరు, నియంతృత్వ పోకడలను నివారించడానికి మాంటెస్క్యూ అనే ఫ్రెంచ్ రచయిత "అధికార పృథక్కరణ" సిద్ధాంతాన్ని సూచించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వ అధికారాలైన శాసన నిర్మాణం, కార్యనిర్వహణ, న్యాయ నిర్ణయాధికారాలు మూడూ ఒకే వ్యక్తి లేదా సంస్థ చేతిలో ఉండకూడదు. పై మూడు అధికారాలు వేర్వేరు వ్యక్తులకు లేదా సంస్థలకు ఉండాలి. ఈ మూడు ప్రభుత్వ శాఖలు ఒకదాని అధికారాలను వేరొకటి నియంత్రిస్తుండాలి. దాన్నే 'నిరోధ సమతౌల్యం', 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' అంటారు.

- ఇందులో భాగంగానే శాసన నిర్మాణ శాఖ, పార్లమెంటు కార్యనిర్వాహక వర్గమైన ప్రధాని, మంత్రిమండలి, రాష్ట్రపతిపై అజమాయిషీ కలిగి ఉంటుంది.
- మన దేశంలో కార్యనిర్వహణశాఖ చేసే పనులకు పార్లమెంటు బాధ్యత వహిస్తుంది. అందుకే మన ప్రభుత్వ విధానాన్ని పార్లమెంటరీ విధానమని, బాధ్యతాయుత ప్రభుత్వం అని కూడా అంటారు.
- కార్యనిర్వహణ శాఖ నిర్వర్తించే కార్యక్రమాలను పార్లమెంటు ప్రశ్నించవచ్చు, విమర్శించవచ్చు.
- పార్లమెంటులో వివిధ తీర్మానాలు ప్రవేశపెట్టడం, ఆమోదించడం లాంటి చర్యల ద్వారా, కార్యనిర్వహణ శాఖ తీరును అదుపుచేయవచ్చు. ప్రధాని, మంత్రిమండలి లోక్‌సభ విశ్వాసం (మెజారిటీ) ఉన్నంతవరకే పదవిలో కొనసాగుతారు.
- వివిధ పార్లమెంటరీ ప్రక్రియల ద్వారా ప్రభుత్వ సమాచారాన్ని రాబట్టడం, వైఫల్యాలను ఎత్తిచూపడం జరుగుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో, అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించడం ద్వారా ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించవచ్చు.

### ప్రశ్నోత్తరాలు

వివిధ ప్రభుత్వ శాఖల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడానికి, పార్లమెంటు సమావేశాల్లో, స్పీకర్ అనుమతితో మంత్రిమండలి సభ్యులను ప్రశ్నలు అడగవచ్చు.

- ప్రశ్నల ప్రాధ్యాన్యాన్ని బట్టి చుక్కలు పెట్టినవి, చుక్కలులేనివి, స్వల్పవ్యవధి ప్రశ్నలుగా వర్గీకరించి, సభాకార్యక్రమాల పట్టికలో చేరుస్తారు. ప్రశ్నలు అడగడానికి 10 రోజుల ముందు సూచించాలి.
- చుక్క గుర్తు పెట్టిన ప్రశ్నలకు మౌఖికంగా సమాధానం ఇవ్వాలి. వీటిపై అనుబంధ ప్రశ్నలు వేయవచ్చు.
- చుక్క గుర్తులేని ప్రశ్నలకు లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలి, వీటిపై అనుబంధ ప్రశ్నలుండవు.
- పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నోత్తరాల కార్యక్రమం చాలా ఆసక్తికరమైన అంశం. సభాధ్యక్షులతో పాటు సభ్యుల సమయస్ఫూర్తి, సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం ఉంటుంది.
- లోక్‌సభ నిబంధనల ప్రకారం సమావేశాల్లో ప్రతిరోజు మొదటి గంట ప్రశ్నోత్తరాలకు కేటాయిస్తారు. కానీ గంటలో పూర్తయిన సందర్భాలు లేవు.
- బ్రిటిష్ మాజీ ప్రధాని సర్ ఆంథోని ఈడెన్ ప్రశ్నోత్తరాలపై మన పార్లమెంటు చూపించే శ్రద్ధను బహువిధాలుగా ప్రశంసించారు.
- ప్రశ్నలు అడగడం వల్ల పరిపాలనా వ్యవస్థ జవాబుదారీతనానికి పరీక్ష పెట్టినట్లవుతుంది. ప్రశ్నల ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారాలు సాధించవచ్చు.

### శూన్యకాలం [Zero Hour]

ప్రశ్నోత్తరాల సమయం తర్వాత సుమారు 12 గంటల నుంచి ఒంటి గంట వరకు పూర్వానుమతి లేకుండా పార్లమెంటు సభ్యులు మంత్రులను ప్రశ్నలు అడగవచ్చు.

- 12 గంటలకు మొదలవుతుంది కాబట్టి దీన్ని "జీరో అవర్" అంటారు. పార్లమెంటు నియమావళిలో ఇది లేదు. ఇది భారత పార్లమెంటుకు మాత్రమే పరిమితమైంది. దీన్ని 1962 నుంచి ప్రారంభించారు.

**అర్ధగంట చర్చ**

ముందుగా సభ దృష్టికి తెచ్చిన ప్రశ్నలకు అనుబంధ ప్రశ్నలపై జరిగే స్వల్పకాలిక చర్చను అర్ధగంట చర్చ అంటారు.

✪ పార్లమెంటు సమావేశమైన మొదటిరోజు, బడ్జెట్‌పై చర్చ సమయంలో అర్ధగంట చర్చ ఉండదు. లోక్‌సభలో, వారం చివరి మూడు రోజుల్లో, చివరి అర్ధగంట, రాజ్యసభలో రోజూ మూడు గంటల నుంచి అయిదు గంటల వరకు ఈ చర్చ ఉంటుంది. ఈ చర్చకు 3 రోజుల ముందు సెక్రటరీ జనరల్ అనుమతి పొందాలి.

**సభాహక్కుల తీర్మానం**

సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సరైన సమాధానాలు ఇవ్వకపోయినా, తప్పుడు సమాచారం ఇచ్చినా, సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా, సభాహక్కులకు భంగం కలిగించారని ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు.

**పాయింట్ ఆఫ్ ఆర్డర్**

సభా నియమాలకు, విధానాలకు భంగం కలిగినప్పుడు, సభ్యులు తెలిపే ఆక్షేపణ /అభ్యంతరాన్ని పాయింట్ ఆఫ్ ఆర్డర్ అంటారు. దీన్ని స్పీకర్ అనుమతించినట్లయితే, మిగతా సభా కార్యక్రమాలు ఆపి, దీనిపై చర్చించాలి. పాయింట్ ఆఫ్ ఆర్డర్ అనుమతించే విషయంలో స్పీకర్‌దే తుదినిర్ణయం. దీని కోసం అప్పీలు ఉండదు.

**ప్రత్యేక ప్రస్తావన / 377 కింద నోటీసు**

పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద గానీ, ఏ ఇతర తీర్మానం కింద చర్చకు రాని అంశాలను లోక్‌సభలో 377 నియమం ద్వారా సభ దృష్టికి తీసుకురావచ్చు. రాజ్యసభలో అయితే ప్రత్యేక ప్రస్తావన అంటారు. లిఖితపూర్వకంగా సెక్రటరీ జనరల్‌కు తెలపాలి. సంబంధిత మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానాన్ని తెలియపరచాలి.

**స్వల్ప వ్యవధి చర్చ**

ఏదైనా ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్న ప్రజా సంబంధ విషయాలపై ఇద్దరు సభ్యుల మద్దతుతో సభలో చర్చ పెట్టవచ్చు. సభా కార్యక్రమాల చివరలో స్పీకర్ ఈ చర్చకు అనుమతిస్తారు.

**నో డే ఎట్ నేమ్డ్ మోషన్**

స్పీకర్ అనుమతించినప్పటికీ సభలో ప్రవేశపెట్టడానికి సమయం, రోజు కేటాయించని వాటిని నో డే ఎట్ నేమ్డ్ మోషన్ అంటారు.

**గిలెటిన్ తీర్మానం**

పార్లమెంటు సమావేశాలు ముగిసేటప్పటికి ఆమోదించాల్సిన బిల్లులు ఎక్కువగా ఉన్నప్పుడు, అన్నింటినీ సమగ్రంగా ఆమోదించడం సాధ్యం కాదు. సమాపన తీర్మానం చేసి మూకుమ్మడిగా బిల్లులను ఆమోదించడాన్ని గిలెటిన్ ఓటింగ్ అంటారు.

## కోత తీర్మానం

బడ్జెట్‌లో ప్రతిపాదించిన మొత్తాన్ని లేదా వివిధ డిమాండ్ల మొత్తాన్నిగానీ తగ్గించి ప్రవేశపెట్టిందే కోత తీర్మానం. ఈ తీర్మానం ఆమోదం పొందితే ప్రభుత్వంపై అవిశ్వాసం ఉన్నట్లు భావించి, మంత్రిమండలి రాజీనామా చేయాలి. ఇవి మూడు రకాలు. విధాన కోత తీర్మానం, పొదుపు కోత తీర్మానం, టోకెన్ కోత తీర్మానం.

## వాయిదా తీర్మానం

ముందుగా నిర్ణయించిన ప్రకారం సభాకార్యక్రమాలు జరుగుతున్నప్పుడు, ఏదైనా ప్రాముఖ్యం ఉన్న ప్రజా సమస్యల పట్ల సభ దృష్టి మళ్లించడానికి ఈ తీర్మానం ప్రవేశపెడతారు. ఈ తీర్మానం ప్రవేశపెట్టడానికి అధ్యక్షుడికి, సంబంధిత మంత్రికి, సెక్రటరీ జనరల్‌కు నోటీసు ఇవ్వాలి. సభ తీర్మానాన్ని వ్యతిరేకిస్తే, అనుమతించమని స్పీకర్ కోరతాడు. అలాంటి సమయంలో తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 50 మంది సభ్యుల మద్దతుండాలి. తీర్మానం ఆమోదం పొందితే సభ వాయిదా పడుతుంది. వీగిపోతే ముందుగా నిర్ణయించిన ప్రకారం కార్యక్రమాలు జరుగుతాయి.

## అత్యవసర వాయిదా తీర్మానం

దేశంలో వరదలు, భూకంపాలు లాంటి విపత్తులు సంభవించినప్పుడు, వాటిని ఎదుర్కొని ప్రజలకు సహాయపడే చర్యలు, చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రభుత్వానికి తెలియజేసే తీర్మానం.

### సావధాన తీర్మానం

పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు ఏదైనా ప్రజాప్రాముఖ్యం ఉన్న అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తేవడానికి లేదా సంబంధిత శాఖ మంత్రి నుంచి అధికారికంగా సమాచారాన్ని రాబట్టడానికి దీన్ని ప్రవేశపెడతారు. దీనిపై చర్చ ఉండదు. 1954 నుంచి పాటిస్తున్నారు.

### నిందా తీర్మానం

ఏదైనా మంత్రిత్వశాఖపై పార్లమెంట్ సభ్యులు అసంతృప్తి చెందినా, మంత్రిపై అసమర్థ, అవినీతి, అధికార దుర్వినియోగ ఆరోపణలున్నా ఈ తీర్మానం ప్రవేశపెట్టవచ్చు. తీర్మానం ఆమోదం పొందితే సంబంధిత మంత్రి రాజీనామా చేయాలి.

### అవిశ్వాస తీర్మానం

లోక్‌సభలోనే ప్రవేశపెట్టాలి. పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలనుకునే సభ్యుడు సమావేశం ఆరంభానికి అరగంట ముందు స్పీకర్‌కు నోటీసు ఇవ్వాలి. తీర్మానానికి కనీసం 50 మంది సభ్యుల మద్దతుండాలి. 10 రోజుల లోపల స్పీకర్ అనుమతించిన రోజున తీర్మానంపై చర్చ జరుగుతుంది. చర్చ అనంతరం ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలకు ప్రధాని సమాధానమిస్తాడు. తర్వాత తీర్మానంపై ఓటింగ్ జరుపుతారు. తీర్మానం నెగ్గితే మంత్రిమండలి రాజీనామా చేయాలి.

- ✪ రాజీనామాకు ముందు ప్రధాని లోక్‌సభ రద్దుకు సిఫారసు చేయవచ్చు.
- ✪ అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించే అధికారం రాజ్యసభకు లేదు.
- ✪ అవిశ్వాస తీర్మానాన్ని మొదటిసారి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంపై 1961లో ప్రవేశపెట్టారు.
- ✪ అవిశ్వాస తీర్మానం ఆమోదించడం ద్వారా అధికారం కోల్పోయిన మొదటి ప్రధాని వి.పి.సింగ్ (10-11-1990), రెండో ప్రధాని ఎ.బి.వాజ్‌పేయీ (17-04-1999).
- ✪ అవిశ్వాస తీర్మానం ఎక్కువసార్లు ఎదుర్కొన్న ప్రధాని (ప్రభుత్వం) పి.వి.నరసింహారావు (ఎనిమిదిసార్లు).

## విశ్వాస తీర్మానం

ఈ తీర్మానం గురించి రాజ్యాంగంలోగానీ పార్లమెంటు నియమ నిబంధనల్లోగానీ ప్రస్తావించలేదు. కేవలం సంప్రదాయంగా పాటిస్తున్నారు. ప్రధాని మంత్రిమండలిని లోక్‌సభలో మెజారిటీ నిరూపించుకోమని రాష్ట్రపతి కోరవచ్చు. విశ్వాస తీర్మానం లోక్‌సభలో ప్రవేశపెట్టిన తర్వాత, మొత్తం సభ్యుల్లో సగానికి పైగా ఆమోదిస్తే మంత్రిమండలి (ప్రభుత్వం) కొనసాగుతుంది లేదా రద్దవుతుంది.

- ✪ ఈ తీర్మానాన్ని మొదటిసారి ఇందిరాగాంధీ ప్రభుత్వంపై ప్రవేశపెట్టారు. విశ్వాస తీర్మానం లోక్‌సభలో వీగిపోవడం వల్ల పదవి కోల్పోయిన మొదటి ప్రధాని ఎ.బి.వాజ్‌పేయీ.

## మహాభియోగ అభిశంసన తీర్మానం

ప్రధాన కార్యనిర్వహణాధికారి అయిన రాష్ట్రపతిపై ఆరోపణలు వచ్చినట్లయితే, మహాభియోగ తీర్మానాన్ని ఆమోదించడం ద్వారా అతడిని పదవి నుంచి తొలగించే అధికారం కూడా పార్లమెంటుకు ఉంటుంది..

- ✪ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులపై ఆరోపణలుంటే, అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టి, చర్చించి, రుజువైతే వారిని కూడా అధికారం నుంచి తొలగించవచ్చు.
- ✪ కేంద్ర ప్రభుత్వంలో ఉన్నతాధికారులైన ఎన్నికల ప్రధానాధికారి, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, సభ్యులపై వచ్చిన ఆరోపణలపై కూడా అభిశంసన తీర్మానంలో చర్చించి, రుజువైతే అధికారం నుంచి తొలగించవచ్చు.
- ✪ మనదేశంలో పార్లమెంటుకు కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థలపై సంపూర్ణ అధికారాలు ఉన్నాయి. కాబట్టి 'పార్లమెంటరీ సుప్రమసీగా పేర్కొనవచ్చు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందడం వల్ల ఒకసారి, విశ్వాస తీర్మానం వీగిపోవడం వల్ల మరోసారి అటల్ బిహారి వాజ్‌పేయీ ప్రధాని పదవిని కోల్పోయారు.

## రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం

లోక్‌సభలో బడ్జెట్ సమావేశాలు ఏటా రాష్ట్రపతి ప్రసంగంతోనే ప్రారంభమవుతాయి. ఆ ప్రసంగంలో గత ఏడాది ప్రభుత్వం సాధించిన విజయాలు, రాబోయే సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలు, విధివిధానాలు తెలియజేస్తారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని కేంద్ర మంత్రిమండలి తయారు చేసి, ఆమోదిస్తుంది. దాన్నే రాష్ట్రపతి లోక్‌సభలో చదువుతారు. రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత ఒక వారం రోజులు ఆ ప్రసంగంపై చర్చ జరిపి, ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఈ చర్చా సమయంలో ప్రభుత్వ విధానాలు, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు మొదలైన వాటిపై విమర్శ జరుగుతుంది. ప్రసారసాధనాల ద్వారా ఈ చర్చను వీక్షించిన ప్రజలు తాము ఎన్నుకున్న ప్రభుత్వ పనితీరును తెలుసుకోవచ్చు. ఈ తీర్మానం వీగిపోతే ప్రభుత్వం ప్రజావిశ్వాసం, సభవిశ్వాసం కోల్పోయినట్లు భావించి రాజీనామా చేయాలి.

## ముఖ్యమైన ప్రశ్నలు

**1.** 'లోక్‌సభలో మెజారిటీ కోల్పోయి, రాజీనామా చేసిన ప్రధాని ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగవచ్చు. విధాన నిర్ణయాలు తీసుకోకూడదు' అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెప్పింది?

ఎ) 1971, యు.ఎన్. రావు Vs ఇందిరాగాంధీ బి) 1972, ఇందిరాగాంధీ Vs రాజ్‌నారాయణ

సి) 1973, రాజ్‌నారాయణ Vs యు.ఎన్.రావు డి) 1974, వి.పి. సింగ్ Vs యు.ఎన్.రావు

**2.** ఏ ప్రధాని కాలంలో భారత బంగారాన్ని యూనియన్ బ్యాంక్ స్విస్‌లో తాకట్టు పెట్టారు?

ఎ) పి.వి. నరసింహారావు బి) చంద్రశేఖర్ సి) చరణ్‌సింగ్ డి) దేవెగౌడ

**3.** ఉపప్రధానులుగా చేసి, ప్రధాని కాలేకపోయినవారు?

ఎ) ఎల్.కె. అడ్వాణీ బి) సర్దార్ వల్లభాయ్ పటేల్

సి) జగ్జీవన్‌రామ్ డి) అందరూ

**4.** కిందివాటిలో ఏవి సరైనవి? ఏవి కాదు?

i) అత్యవసర పరిస్థితి ప్రకటించే నాటికి లోక్‌సభ రద్దయి ఉన్నా, తర్వాత రద్దయినా అత్యవసర పరిస్థితిని సమర్థిస్తూ రాజ్యసభ తీర్మానాన్ని ఆమోదించాలి.

ii) కొత్త లోక్‌సభ ఏర్పడి, సమావేశమైన 30 రోజుల్లోపు అత్యవసర పరిస్థితి ప్రకటనను ఆమోదించాలి.

iii) ఉభయ సభల్లో ఒక సభ ఆమోదించి, రెండో సభ తిరస్కరించినా, తటస్థంగా ఉన్నా 30 రోజుల తర్వాత అత్యవసర పరిస్థితి రద్దవుతుంది.

iv) ఉభయ సభలు తిరస్కరించినా అత్యవసర పరిస్థితి 6 నెలలు కొనసాగుతుంది.

ఎ) i, ii, iii సరైనవి, iv సరికాదు బి) ii, iii, iv సరైనవి, i సరికాదు

సి) iii, iv, i సరైనవి, ii సరికాదు డి) iv, i, ii సరైనవి, iii సరికాదు

**5.** ఉపరాష్ట్రపతి తిరిగి ఎన్నిక కావాలంటే

ఎ) ఒకసారి తిరిగి ఎన్నికవడానికి రాజ్యాంగం వీలు కల్పించింది.

బి) తిరిగి ఎన్నికవడాన్ని రాజ్యాంగం నిషేధించింది.

సి) రాజ్యాంగంలో పేర్కొనలేదు.

డి) రెండుసార్లు తిరిగి ఎన్నిక కావొచ్చు.

**జవాబులు:** 1-ఎ; 2-బి; 3-డి; 4-ఎ; 5-సి.

**రచయిత: మెరుపుల నారాయణమూర్తి**